# శాంతి

# SANTI

విశ్వమానవ సాభ్రాతృత్వ సందేశము గల ఆధ్యాత్మిక మాసపత్రిక

జనవరి/January - 2022

ప్రణవోధనుః శరోహ్యాత్మా బ్రహ్మతల్లక్ష్యముచ్యతే
అప్రమత్తేన వేద్ధవ్యం శరవత్ తన్మయో భవేత్

ఏకం సత్ విప్రా బహుధా వదంతి

ఒకే సత్యము అనేక విధములుగా బ్రహ్మజ్ఞులచే చెప్పబడినది.

– ఋగ్వేద సంహిత

# శాంతి

# SANTI

**విశ్వమానవ సౌభ్రాతృత్వ శాంతి సందేశ ఆధ్యాత్మిక మాసపత్రిక**

**స్థాపకులు : పరమపూజ్య శ్రీస్వామి ఓంకార్‌జీ మహారాజ్**

**సంపాదకులు : స్వామిని వినమ్రానంద**

సంపుటి / **Vol. 98** జనవరి/**January - 2022** సంచిక/**No.1**

| వ.నెం. | విషయ సూచిక | పేజి నెం. |
|---|---|---|
| 1. | ప్రార్థన – నిత్య సంధ్యావందన మంత్రము | 2 |
| 2. | ధ్యానము | 2 |
| 3. | నూతన సంవత్సర సందేశము – స్వామి ఓంకార్ | 3 |
| 4. | పరమ పూజ్యశ్రీ ఓంకార స్వామి వారి 128వ జన్మదిన విజ్ఞప్తి | 4 |
| 5. | జన్మదిన సందేశము – విశ్వ జన్మదినం – స్వామి ఓంకార్ | 5 |
| 6. | ఓంకార్ ఆత్మకథ – అనువాదం : శ్రీమతి బొప్పన అరుణాదేవి | 6 |
| 7. | చిరస్మరణీయమైన సుదినము – శ్రీ తారకం గారు | 9 |
| 8. | భక్త రక్షకుడు భగవంతుడు మాత్రమే – స్వామి రామదాస్ | 11 |
| 9. | తత్వమసి – శ్రీ తెన్నేటి విశ్వనాథం | 13 |
| 10. | శ్రీ తులసి సర్వస్వము – జి.వి.యస్. సుబ్రహ్మణ్యం | 18 |
| 11. | భగవత్ కృప – శ్రీ అఖండానంద సరస్వతీ మహరాజ్ | 21 |
| 12. | గురు శిష్య సంబంధము – శ్రీమతి సరస్వతీ దేవిగారు | 24 |
| 13. | దాతలకు విజ్ఞప్తి | 26 |
| 14. | కార్యక్రమములు, విరాళములు | 27–28 |

*** ఈ పత్రికలో ప్రచురింపబడిన వ్యాసముల యొక్క భావాలకు రచయిత్రి / రచయితలే బాధ్యులు కాని. సంపాదకులు కారు.**

**జీవిత సభ్యత్వం రూ. 1000/–లు సాలుసరి రూ.100/–**

# ప్రార్థన

## ప్రార్థన యొక్క శక్తి అనంతమైనది

(గాయత్రి – నిత్య సంధ్యావందన మంత్రము. ఋగ్వేదము)

నమస్తే సతతే జగత్కారణాయ,

నమస్తే చితే సర్వలోకాశ్రయాయ

నమోఽద్వైత తత్త్వాయ ముక్తిప్రదాయ

నమో బ్రహ్మణే వ్యాపినె శాశ్వతయ.

తా॥ నిత్యుడును, సత్యరూపుడును, జగత్కారకుడును, అగు దేవునికి నమస్సు. సకల లోకాలకు ఆశ్రయభూతుడగు చిన్మూర్తికి నమస్సు. శాశ్వతుడునగు పరబ్రహ్మకు నమస్కారము.

(ప్రతి సంవత్సరము పూజ్యశ్రీ ఓంకార స్వాములవారు తమ జన్మదిన సందేశమునిచ్చుటకు ముందుగా పైనుడివిన శ్లోకమును పఠించెడివారు.

# ధ్యానము

## ప్రార్థన ద్వారా ధ్యానం సులభమవుతుంది

శ్లో॥ ఓమిత్యేతదక్షర మిదగ్ం సర్వం!

తస్యోవ వ్యాఖ్యానం !

భూతం భవద్భవష్యదితి సర్వమోంకార ఏవ !

యచ్చాన్యత్రి కాలాతీతం, తదప్యోంకాఏవ ! (మాండుక్యోపనిషత్తు –(1))

తా॥ మనకు కనిపించే ఈ విశ్వమంతా ఓంకారమే, గడచిన కాలం, గడుస్తున్న కాలం గడవబోయే కాలం (భూత, వర్తమాన, భవిష్యత్తులు) అంతా కూడా 'ఓంకారమే' ఈ మూడు కాలాలకు మించిన దేదైనా వుంటే అదియూ ఓంకారమే. ప్రకృతి యొక్క చైతన్యం వలన ఈ సృష్టి అంతా ప్రారంభమైనట్లు వేదాలలో చెప్పబడింది. ఈ సృష్టి క్రమాని కంతటికి, మూల శక్తియైన ప్రకృతి యొక్క కంపనం కారణం. ఈ విశ్వాన్ని ఒక శబ్ధం ద్వారా సూచించాలంటే దానికి ప్రతీక (చిహ్నం) ఓంకారమే.

# నూతన సంవత్సర సందేశము 2022

**స్వామి ఓంకార్**

నూతన సంవత్సరం చిరస్మరణీయంగా ఉండడం కోసం, ఒక్కసారి ప్రియమైన "శాంతి" పాఠకుల, ఇతర భక్తుల పవిత్రమైన హృదయాన్ని ఆ భగవానుని అస్తిత్వ స్పర్శతో స్పృశించాలని నా హృదయం ఉవ్విళ్ళూరుతోంది.

నాకు అనిపిస్తుంది ప్రతిరోజూ ఒక నూతన ప్రారంభ మేనని, నేను కొత్తగాజన్మిస్తున్నాను. ప్రతినెలారంభంలోనూ నేను అనుకుంటాను నాకు ఒక కొత్త ప్రారంభమని. ప్రేమ, శాంతిలతో నిండిన మరొక సంవత్సరంతో మనకు ఇప్పుడు భగవానుని ఆశీస్సు వచ్చింది. నా శాంతిలో, నా ప్రేమలో సర్వాన్ని తనలో ఇముడ్చుకునే 'విశ్వప్రేమ'లో 'శాశ్వత శాంతి' లో, ప్రపంచ ప్రజలందరూ ఉన్నారు.

సంతోషకరమైన నూతన సంవత్సరంరోజున, ఆపాదమస్తకం కణకణాన నా శరీరంలో ఆ పరమేశ్వరుడి ఉనికిని అనుభూతి చెందుతానని దృఢసంకల్పం చేసుకుంటున్నాను. కనుక మూసినా, కనులు తెరిచినా సూక్ష్మమైన అణువు నుండి, అతిపెద్ద గ్రహము వరకు అంతటా ఉన్న ఆయన ఉనికిని అనుభూతి చెందడానికి, ఆయనను దర్శించడానికి ప్రయత్నం చేస్తాను. "ఈశావాస్య మిదం సర్వం" ఈ ప్రపంచమంతా, ఈశ్వరునితో (విభజించడానికి వీలుకాని, సమస్తలోకాలకి ప్రభూవైన ఈశ్వరునితో) నిండి, పరివ్యాప్తమై వుంది.

మనప్రియతములు, భక్తిపూర్ణులు అయిన 'శాంతి' పాఠకులకు మాత్రమే కాకుండా, తూర్పు, పడమర దేశాల అధినాయకులందరికీ శాంతి, సంతోషం, దైవ ప్రేరణ లభించాలని కోరుకుంటున్నాను.

ప్రపంచంలో శాంతి నెలకొనుగాక. అది నాతోనే ప్రారంభమవ్వాలి!

ప్రతిక్షణ అమూల్యమైనది ప్రత్యేకించి నూతన సంవత్సరారంభంనుంచి. కాబట్టి అమూల్యమైన కాలాన్ని వ్యర్థపరచకుండా, భగవంతుని బిడ్డలందరకీ, (చెట్లు, పక్షులు, జంతువులు వగైరా) అన్ని జీవన సామ్రాజ్యాల్లోనూ ఉన్న ప్రాణికోటికి శాంతికలగాలని కోరుకుంటూ వేద మంత్రాలతో 'సర్వేషాం శాంతిర్భవతు' అందాం! (1973)

# పరమ పూజ్యశ్రీ ఓంకార్ స్వామీజీ 128వ జన్మదిన విజ్ఞప్తి

దివ్యాత్మ స్వరూపులందరికి ప్రణామములు.

"ప్రతి దినము జన్మదినమే" అని పూజ్య ఓంకార స్వామీజీ వారు సాధకులకు తమ దివ్య సందేశాన్ని అందించేవారు.

ఒకసారి హాంకాంగ్ నుండి ఆశ్రమ భక్తుడు ఒకరు గ్రహకూటమి వల్ల రాబోయెడి ప్రపంచ విపత్తు నుండి తప్పించుకొనుటకు ఏమి చేయవలెను అని ఓంకార్ స్వామికి ఉత్తరం వ్రాసారు, దానికి బదులుగా స్వామీజీ, "ప్రియమైన సోదరా! ఫిబ్రవరిలో రానున్న అష్టగ్రహకూటమిని గురించి వ్యక్తిగతముగా నేనేమియు తాపత్రయపడుట లేదు. నాకు ప్రతిరోజును ఒక్కటియే! గ్రహములు కలిసిననూ, కలయకున్ననూ ప్రతిరోజును దైవము స్థిరమై ఒకే రీతిగా ప్రకాశించుచుండెను. ప్రకృతి చట్టములను బట్టి గ్రహముల కూటమిలో కొన్ని మార్పులుండిన ఉండవచ్చును గాని యెన్ని మార్పులున్నను దైవమును అనుసరించినవారు సదా సురక్షితముగానే ఉందురు."

**ఈ కరోనా / ఒమిక్రాన్ వైరస్‌ల కారణముగా పూజ్యశ్రీ ఓంకార స్వామీజీ వారి 128 జన్మదినము (తేది : 21-01-2022) నిర్వహించబడుట లేదని తెలుపుటకు క్షంతవ్యులము.** స్వామీజీ వారు వారి జన్మదినాన్ని ఎంతో నిరాడంబరంగా నామ సంకీర్తన, జపము, ప్రార్ధన, ధ్యానాదులతో జరిపించేవారు. అదేవిధంగా ఈ సంవత్సరము మాత్ర ఆశ్రమ వాసులు ఈ క్రింది విధంగా స్వామీజీ జయంతి జరుపుకొనెదరు.

## కార్యక్రమములు

ప్రతిరోజు ఉ॥ 6 గం॥ల నుండి సా॥ 6 గం॥ల వరకు

తేది. 19-01-2022 (బుధవారం) - నామ సంకీర్తన (ఏ నామమైన)

తేది. 20-01-2022 (గురువారం) - ఓంకార జపము

తేది. 21-01-2022 (శుక్రవారం) - శాంతి ప్రార్థన, ధ్యానము

కావున భక్తులందరు ఆశ్రమ శాఖలలోను, తమ తమ స్వగృహములలోను, తమ తమ గ్రామాలలోను, తమ తమ నగరాలలోను పైన చెప్పిన విధము9గా కరోనా నిబంధనలను అనుసరిస్తూ వాని శక్తి మేరకు జరుపవలెను. క్రిందటి సంవత్సరము వలె ఈ సంవత్సరము స్వామీజీ జన్మదినోత్సవము జరుపలేకపోతున్నాము అని నిరుత్సాహపడకుండా, పైన చెప్పినట్లు వారి వారి శక్తి మేరకు జరిపినచో అదియే మనము స్వామీజీకి సమర్పించే నిజమైన జన్మదిన కానుక.

ఓం ఓం ఓం

**గురుసేవలో**

**ఆశ్రమ యాజమాన్యం**

ఈ సంవత్సరము స్వామీజీ జన్మదిన సందర్భంగా నేటి నుండి వారి వారి నోటు పుస్తకములలో లోకశాంతి (ఏభాషలో అయినా సరే) ఎన్నికతో పాటు వ్రాసి ఆశ్రమమునకు ఫిబ్రవరి మొదటివారం లోపల చేరేటట్లు ఎడిటర్, శాంతి పత్రిక పేరున పంపవలెను.

మీరు జరుపుకున్న స్వామీజీ జన్మదినోత్సవము వివరములు వెంటనే మొబైల్ నెం. 85009 92703 వాట్సప్‌లో పంపించవలసినది కోరుచున్నాము.

# జన్మదిన సందేశం - విశ్వ జన్మదినం 1922

**పరమ పూజ్యశ్రీ ఓంకార్ స్వామీజీ 128వ జన్మదిన సందేశము**

వ్యక్తుల జన్మదినములు చేయుటకంటే విశ్వ జన్మదినమును చేయుటే, విలువైన కాలమును సద్వినియోగము చేయుటయని ఆనందించుచుందును. నా విశ్వ జన్మదినములో పక్షులు గీతాగానము చేయుచున్నవి. పుష్పములు దివ్య సువాసన నొసంగు చున్నవి. సముద్ర కెరటములు ప్రణవ గానము చేయుచున్నవి. నక్షత్రములు దివ్యతేజస్సు నొసంగుచున్నవి. ఈ విశ్వ జన్మదినములో మీ అందరి హృదయ పద్మములు దైవ చింతనతో నిండి వికసించుచున్నవి. చూడుడు ! వాయుదేవుడు దివ్య మారుతమును వీచుచుండెను. వీక్షించుడు ! సూర్య భగవానుడు మానవకోటి నంతను నూతనమైన దివ్య తేజస్సుతో నింపుచు, నిరంతరము ప్రతి వ్యక్తియొక్క జన్మదినమునకు తోడ్పడు చుండును. విశ్వ జన్మదినమున విశ్వప్రేమ అనుభవించుట కిదియే పరమ పావనమైన క్షణము. లోకశాంతియే నా జన్మదినమునకు గమ్యస్థానము. మీ అందరి ఆత్మానుభవమే నా నిజమైన జన్మదినోత్సవము అద్వితీయమైన బ్రహ్మమునందు బేధము కొంచెమైనను లేదు. ఉన్నదొక్కటియే గాన, నా జన్మదినము మీ జన్మదినమే! మీ ఆనందము నా ఆనందమే ! మనమందరము ఆనందముగా నుండుటకు ఈ జన్మ దినమున ఆత్మ భావనతో దివ్య జ్ఞప్తితో దైవ సన్నిధిననుభవించుచు గడిపెడి క్షణములను, నాకు శాశ్వతమైన కానుకలుగా అర్పించ గోరెదను.

సర్వేషాం స్వస్తిర్భవతు । సర్వేషాం శాన్తిర్భవతు ।

సర్వేషాం పూర్ణం భవతు । సర్వేషాం మంగళం భవతు ॥

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

# శాంతి ప్రదాత శ్రీ ఓంకార్ స్వామీజీ ఆత్మకథ

**అధ్యాయం - 34**

**మూలం : స్వామి ఓంకార్**

**అనువాదం : శ్రీమతి బొప్పన అరుణాదేవి**

## అంతర్వాణి ప్రబోదాన్ని వినడానికి ప్రయత్నించు

కాలిఫోర్నియాలో నేను గడిపిన ఆధ్యాత్మిక మౌన జీవనం ఎందరో సత్యాన్వేషకులకు, ఆత్మాన్వేషకులకు, సాధకులకు, శాంతి కోసం ప్రయత్నించేవారికి మార్గదర్శకగా నిలిచింది. నేను స్థాపించిన శాంతి కేంద్రాలు అటు లాస్ఏంజెల్స్‌లోనూ, ఇటు హాలివుడ్‌లోనూ ఎందరికో శాంతిని ప్రసాదించాయి. ధ్యానం చేయటం నేర్చుకోవడానికి దోహదపడ్డాయి. నన్ను వారు తరుచుగా, ఆహ్వానించి ప్రవచనాలు ఇమ్మని అడిగేవారు. అలాగే సాధకులకు వ్యక్తిగతంగా, ఆధ్యాత్మికంగా ఎదగడానికి సహాయం చేసేవాడిని. వాళ్ళతో క్రమం తప్పకుండా ధ్యానం చేయించేవాడిని. వాళ్ళతో ఆధ్యాత్మిక దినచర్య డైరీని వ్రాయించేవాడిని. ప్రతి వారం అందులో తప్పులు సరిదిద్దేవాడిని.

నేను అక్కడ ఉండగా సాధకులకు ఉపకరించే చక్కని సందేశాన్ని తయారుచేశారు. సాధకులందరూ దానిని ఎంతగానో మెచ్చుకున్నారు. అందులో అన్నీ నా సాధన అనుభవాలను తెలియచేశారు. అవి సాధకులను ఒక్కో మెట్టు పైకి ఎక్కించి సమయం వచ్చినప్పుడు సమాధి స్థితిని అందిస్తాయి.

### అంతర్వాణి

ఉష్ .... ఉష్..... బాహ్య ప్రపంచపు విషయాల్లో తలమునకలు అవుతున్నంత కాలం నీ అంతర్వాణి ప్రబోధము నీవు వినలేవు. నీకు బాహ్య ప్రపంచపు విషయాలలో విసుగు పుట్టడం లేదా? నీకు నీ అంతర్వాణి ఏమి చెపుతుందో వినాలి అనిపించడం లేదా? నీ మనశక్తులన్నింటిని వినియోగించి అంతర్వాణి ప్రబోధాన్ని వినాలి అనుకుంటున్నావా? అలా అయితే ప్రార్థించు. వచ్చి నాలో కలిసి కాసేపు కాలం గడుపు. నీ శరీరాన్ని స్థిరంగా, సుఖంగా ఉంచుకో. నీ గురించి గాని, నీ పనుల గురించి గాని ఏమీ ఆలోచించవద్దు. నిశ్శబ్దంగా నీ అంతర్వాణి ఏమి చెపుతోందో వినడానికి ప్రయత్నించు. ఎప్పుడు నీ అంతర్వాణి ప్రబోధాన్ని నీవు వినగల్గుతావో అప్పుడే నీ హృదయంలోని తాపము చల్లారుతుంది. అంతేగాని బాహ్య ప్రాపంచిక భోగాల వెంట పరుగెత్తి పరుగెత్తి అలసిపోతావు తప్ప శాంతి దొరకదు. అంతర్వాణి ఎప్పుడూ నీతో మాట్లాడడానికి సిద్ధంగా ఉంటుంది. కానీ నీవే దాన్ని వినడానికి, పట్టించుకోవటానికి సమయం లేకుండా , క్షణం తీరిక లేకుండా బాహ్య ప్రపంచంలో మునిగిపోతున్నావు.

ఓ ఇంద్రియాల్లారా! ప్రార్థించండి! మీ ఇంద్రియలోలత్వాన్ని కనీసం కొద్దిసేపు పనిచేయకుండా నియంత్రించండి. ఓ నా బుద్ధీ! కనీసం కాసేపయినా పనికిమాలిన ఆలోచనలు వదిలిపుట్టి అంతర్వాణి ప్రబోధాన్ని వినటానికి ప్రయత్నించు. ఓ అహంకారమా! ప్రార్థించు. అంతరాత్మతో అహంకారాన్ని అణిచివేసి నీ అంతర్వాణి ప్రబోధాన్ని వినటానికి ప్రయత్నించు.

ఇంద్రియాలు, బుద్ధి, మనస్సు, అహంకారము అన్నీ అణిగిపోయినప్పుడు ఆత్మ తన అంతర్వాణిని వినిపిస్తుంది. దివ్యత్వాన్ని తెలియచేస్తుంది. అంతరాంతరాల్లో నిండిపోయిన పరంధాముడిని దర్శింపచేస్తుంది. అందువల్ల ప్రియమైన సాధకులారా! ఇంకా ఇంకా మనస్సు లోతుల్లోకి అంతర్ముఖమయినప్పుడు ఆత్మ తన అంతర్వాణిని వినిపిస్తుంది. అది మాత్రమే నీ జన్మహక్కు అని మరిచిపోవద్దు.

నీ అంతర్వాణి ప్రబోధాన్ని వినటానికి ప్రయత్నించు. అది వినగల్గినప్పుడు నీవు జనన మరణ చక్రము నుండి విముక్తి చెందుతావు. భగవంతుని అనుగ్రాహం వలన సాధకులదరికి అలాంటి దివ్యమయిన అంతర్వాణి ప్రబోధాన్ని వినగలిగే అవకాశం లభించుగాక! ఆత్మదర్శనము కల్గుగాక! ఓం....ఓం....ఓం...

ఇక కాలిఫోర్నియాకు వీడ్కోలు అనే ఈ అధ్యాయాన్ని ముగించేముందు శాంతి కేంద్రములో నేను భక్తులందరికి అందించిన శాంతి సందేశాన్ని వివరిస్తాను.

నా ప్రియమైన ఆత్మ స్వరూపులయిన సోదరసోదరీమణులారా!

ఈ రోజు మనం వీడ్కోలు తీసుకుంటున్న సందర్భంలో నేను నా చేతులు చాచి మీ అందరినీ ప్రేమపూర్వకంగా దగ్గరికి తీసుకుంటున్నాను. ఆ ప్రేమకు ఎల్లలు లేవు. ఎలాంటి గౌరవాలు, పురస్కారాలు కోరదు. కేవలం ఆనందం, సంతృప్తి, ప్రేమ అంతే. అందులో కలయికలు, విడిపోవటాలు ఉండవు. అంతులేని శాంతి తరంగాల్లో తేలియాడుతూ ఒకరినొకరము మనస్ఫూర్తిగా అర్థం చేసుకుంటాము. భగవంతుని గొప్పతనము సహస్ర సూర్యకాంతితో తేజోమయంగా విరాజిల్లుగాక!

నేను సూర్యుడికే సూర్యుడిని

ఓం...ఓం...ఓం....

తేజస్సు ... తేజస్సు ... తేజస్సు

నీ లోపల బయటా కూడా తేజోవంతమయన జ్ఞాన ప్రకాశం వెల్గుతోంది. అది నీ పైన, క్రింద, నీ చుట్టూ ప్రకాశంతంగా దేదీప్యమానంగా ప్రజ్వరిల్లుతోంది. ఆ దివ్యానుభూతిని అనుభవంలోనికి తెచ్చుకో. అనంతమయిన ఆ శాంతిలో మునిగిపో.

భగవదనుగ్రహం పొందిన నా ప్రియమైన సాధకులారా! మీరు మీ మొదటి మంత్ర దీక్షలో నిన్ను నీవు తెలుసుకోవటం నేర్పబడింది. మౌనంగా నీలో నీవు నిశ్చలస్థితిని పొందటం రెండవ మంత్రదీక్షలో నేర్పబడింది. ఆలోచనలను నియంత్రించటము మూడవ మంత్ర దీక్షలో. అత్యద్భుతమయిన సోహం

దివ్యానుభవాన్ని, హృదయ కవాటాలను తెరిచి, నాడీ చక్రాలన్నింటిని వికసింపజేసి చిట్ట చివరికి నిన్ను భగవంతుని సన్నిధికి చేరుస్తుంది. అక్కడ నీవు సత్యాన్ని దర్శించగల్గుతావు. పరమాత్మునికి నీకు అభేదాన్ని గుర్తించగల్గుతావు. భగవదనుభూతిని వదలకుండా పట్టుకోవడానికి ప్రయత్నించు. ఓం... ఓం... ఓం...

అలాంటి దివ్యమయిన స్థితిలో చూచేవాడు, చూడబడేది అంటూ ఉండదు. నీ అన్వేషణ పూర్తి అవుతుంది. నీ సందేహాలన్నీ తీరిపోతాయి. నీ ప్రశ్నలన్నింటికి సమాధానాలు లభిస్తాయి. మాటలు ఆగిపోయి మౌనంలోకి వెళ్ళిపోతావు. నీ అహం చల్లారిపోతుంది. దివ్యమయిన పరమాత్మానుభవంలో తేజోవంతుడివి అవుతావు. ఓం...ఓం...ఓం...

పవిత్రమయిన పక్షులు స్వేచ్ఛగా ఆకాశంలో ఎగిరేటప్పుడు వాటి రెక్కల సవ్వడులలో సోహంకారం వినిపిస్తాయి. ఊపిరి పీల్చేటప్పుడు పవిత్రమయిన ఓంకారాన్ని జపిస్తున్నాయి. నీ ఆత్మ, నీ జీవితం, నీ ఉనికి పరమాత్మను గుర్తించే ఓంకారాన్నే తలపిస్తున్నాయి. అందువల్ల పక్షుల్లారా! స్వేచ్ఛగా కొండకోనల్లో, పల్లెల్లో, పట్టణాల్లో విహరిస్తూ శాంతి సందేశాన్ని మీ రెక్కల చప్పుళ్ళలో దగ్గరి వారికి, దూరంలో ఉన్నవారికి, యావత్తు ప్రపంచానికి అందించండి. సత్యాన్వేషకులకు మార్గదర్శనం చేయండి. వారిపై పూల వర్షం కురిపించండి. అంతటా శాంతి సంతోషాలను నింపండి.

పేద, గొప్ప, పుణ్యాత్ములు, పాపాత్ములు అనే తేడా లేకుండా అందరికీ ఆశీర్వాదాలు అందచేయండి. ఎందుచేతనంటే ఎవ్వరూ నీకు పరాయివారు కాదు. నీ చేతులు ఎల్లప్పుడూ ఆశీర్వదించడానికే ముందుకు రావాలి. ఎన్నడూ ఎవరినీ మాటలతో కాని, చేతలతో గాని, ఆలోచనలతో గాని బాధ పెట్టవద్దు. ప్రపంచాన్నంతటిని నీ సోహంకారముతో ఒక్కటిగా చేయి. తేజస్సు, దివ్యత్వము, స్వేచ్ఛ నీ సొంతము.

నీ జీవితం చివరి వరకూ నేను నీతోనే ఉంటాను.

స్నేహితులారా! నేను మీతో మూడు పవిత్రమయిన పుష్పాలను నా దివ్యమైన ఆధ్యాత్మిక జీవితమనే చెట్టునుండి వచ్చిన వాటిని పంచుకోవాలనుకుంటున్నాను. మీరు ఆ పవిత్రమయిన పుష్పాల సౌరభాలను ఆస్వాదిస్తున్నారు. అదే 'విశ్వ ప్రేమ' అనే పుష్పము. దానినే మీరు మీ బాహ్య ప్రపంచంలో కూడా ఆస్వాదించడానికి ప్రయత్నం చేయండి. ఇక రెండవ పుష్పము 'అనంతమయిన శాంతి'. మనము అందరము ఆ దివ్య పుష్ప సౌరభాన్ని ఆస్వాదిస్తూ ప్రపంచ మానవాళికందరికి దాన్ని పంచిపెడదాము. ఇక మూడవ పుష్పము 'అంతర్ముఖ స్థితి' అలాంటి నిశ్చలస్థితిలో ప్రాపంచిక విషయాలన్నీ కనుమరుగయిపోయి దివ్యానందంలో మునిగితేలిపోదాము.

ఈ రోజు భగవంతుని ఆశీర్వాదములతో జరిగిన ఈ సమావేశాన్ని మనం ఎప్పటికీ మన హృదయాలలో పదిలంగా, మర్చిపోకుండా దాచుకుందాము. మనందరికి ఎడబాటు అన్నది లేనే లేదు. ధ్యానస్థితిలో మనందరి ఆత్మలు ఏకంగా ఉంటాయి.

# చిరస్మరణీయమైన సుదినము

**శ్రీ తారకం గారు, బ్రహ్మసమాజ అధ్యక్షులు**

## ఈశ్వరునితో సంభాషింపుము

ఏనాటినుండియో ఎదురు చూచుచున్న స్వామిజీ సందర్శన భాగ్యము జనవరి 20వ తేదీని కలిగినందులకు నేను భగవానునికి ప్రణమిల్లుచున్నాను. వారి జన్మదినోత్సవముకు ముందురోజు– **జనవరి 20వ** తేదీని నేనెట్టకేలకు **ఈశ్వరేచ్ఛవలన స్వామిజీ ఓంకార్‌ని దర్శించ గలిగితిని. శాంతి ఆశ్రమ ప్రాంగణములోనికి ప్రవేశించగానే ప్రయాణ బడలిక మాయమైపోయి ఆప్రశాంత వాతావరణము పురాణ గాథలలో వర్ణింపబడిన ఋషివాటికలను స్మరణకు తెచ్చినది.** నేనొక ప్రార్థనమంటపంలో ప్రవేశించినాను. ఆశ్రమవాసులు భజన చేసుకొనుచున్నారు. కొలది నిముషములకే స్వామిజీ వేంచేసినారు. నేను క్రొత్తవాడినైనా, నన్నుచూచి చిరునవ్వుతో ఆశీర్వదించినారు. పిమ్మట కార్యక్రమము సాగినది. బైబిల్, భగవద్గీతలనుండి కొన్ని ప్రవచనములు ఇంగ్లీషులోను తెలుగులోను చదివించి వ్యాఖ్యానముచేసి కొన్ని ఆశ్రమగీతములు పాడించిన తరువాత అతి సులభమైన భాషలో కొన్ని ఉపదేశవాక్యములు ఉచ్ఛరించారు. ప్రణవోచ్చారణతో ముగించినారు. అక్కడి ఆనుమాయితి ప్రకారము నన్నుకూడ మాటలాడమని వారి శలవయినది, వారి ప్రేమానుభూతివలన నాకు తోచిన కొన్ని విషయములు పలుక సాహసించితిని. ఆనాడు భావనా ప్రపంచంలో రామ మోహనదేవేంద్రనాథ, వివేకానందులు, విహరించి పలికించినారు. పిమ్మట సవినయముగా స్వామీ ఓంకార్‌జీని, వారి పరివారమును కాకినాడ ఆహ్వానించితిని.

అదొక ఆపూర్వ సంఘటన. బ్రాహ్మ మందిర ప్రతిష్ఠాపన దిన వార్షికోత్సవవారం. ఉత్సవాలు జరుపుకొంటున్నాము. జనవరి 27వ తేదీని పూజ్యశ్రీ ఓంకారస్వామి మాఆహ్వానమును మన్నించి ప్రపంచశాంతి కొరకు. సర్వమతస్థుల సమిష్టి ప్రార్థన సమావేశమునకు సభాపతిగా ఆసీనులయినారు. ప్రార్థనా ప్రసంగమలయిన పిదప స్వామిజీ సందేశము కొరకు వేచియున్న జనము నిశ్శబ్దముగా వారివాగామృతమును గ్రోలినారు. అమెరికాలో ఒక అనుభవమును వారు ముచ్చటించినారు. వారి దర్శనభాగ్యము పొందిన ఒక సాధ్వి ఇంటికి వెళ్ళినంతనే ఈ రోజు ఇంత కలకలలాడుతోందేమి మీముఖారవిందమని భర్త ప్రశ్నింపగా స్వామిజీ దర్శనము వలన లోలోపల ప్రవేశించిన వెలుగుయొక్క మహిమ అని ఆవనిత ప్రత్యుత్తరమిచ్చెనట. ఆనాడు ఆటువంటి నూతన తేజమునే ప్రతి వారికి స్వామిజీ అనుగ్రహించినారు. వారొసంగిన సందేశసారాంశము ఒక్కటే ముఖ్యమైనమాట. "ఏతరుణము కొరకు వేచియుండకు ఇక్కడనే ఈక్షణముననే ఈశ్వర స్పర్శ యొక్క దివ్యానుభావమును పొందుము. ఈశ్వర వాణిని వినుము. ఈశ్వరునితో సంభాషింపుము ఈశ్వర ప్రేమాలింగనములో ఇప్పుడే. ఇక్కడనే ఆనందానుభవమును పొందుము. మరుక్షణము

నీదికాదు.” తాను ప్రతి ప్రవక్తయొక్క సాంగత్యానుభవము ఆత్మీయముగా ఎట్లుపొందుచుందురో, సకలప్రాణికోటిని ఏరీతిగా ప్రేమించుటకు ప్రయత్నించు చుందురో ఉపదేశించినారు.

ఆసాయంకాలము దివ్యజ్ఞాన సమాజ ప్రాంగణమందు వివేకానంద స్మరణ సభలోకూడ వారు ప్రసంగించుచు శ్రీస్వామిజీని తన ఆత్మలోనికి ఎట్లు ఆహ్వానించు కొనుచున్నారో వక్కాణించిరి. ఒక ఇతిహాసముచెప్పి నిరాశావాదులకు నూతనోత్తేజమును కలిగించిరి. ఒక వృద్ధురాలు తిరగలిలో పిండి విసురుచు కన్నీరు కార్చుచుండెను, ఎందులకని తోటివారడుగగా “నాజీవితాశయములన్నియు కూడ ఈరీతినే పిండయిపోవునుగదా! పరమాత్మకు హత్తుకొన నేరకున్నానని విలపించుచున్నా” ననెను. “నిరాశవలదు! అదిగో చూడు, కొన్ని బియ్యపుగింజలు తిరుగలి రంధ్రములలో అతుకుకొనియున్నట్లే, నీవాస్తవిక జీవిత కణములు జగన్మాతకు హత్తుకొనియే యుండును.” అని ఒకసాధువు చెప్పెనట. ఇంకొక సాధుసత్తముడు, “నాకు ఎల్లవేళలందును పని, బాధ, దుఃఖము ప్రసాదింపు” మని వేడుకొనెనట. అవి లేనిచో మానవ దృష్టి సర్వేశ్వరునివైపు తిరుగదుకదా! ఇట్టి ఉపమానములతో సభికులను ముగ్ధులను గావించిరి.

ఓంకార్ కాషాయము ధరించినను, సామాన్య ప్రజల స్వామి. ఏకాంతము గానున్నను పీడిత ప్రజానీకముతో సహవాసము చేయుచుందురు. చిన్నమాటలతో చిరునగవుతో తమ ఆత్మశాంతి నుండి ప్రజ్వలించు నిరంతర శాంతి ప్రార్థన ప్రణవముతో మేళవించి ప్రజకు ప్రసాదముగా పంచి పెట్టుచుందురు. వారి కాకినాడ యాత్ర మరపునకు రానిది. ఆసాధుసత్తమునకు మాజోహారులు!

**ఓం తత్‌సత్ ఓం.**

**ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః**

“నేను లెక్చరిచ్చుచున్నాననెడి అహంభావము లేకున్న బాలును, అంతరంగమున భక్తి నెలకొల్పుకొనవలెను. “నేను” అనెడి భావము వదలి అన్నింటికి భగవంతుడే ‘కర్త’ అను దృఢవిశ్వాసము కలిగి ప్రవర్తింపుము.

హిందువులు, మహమ్మదీయులు, క్రైస్తవులు మొదలగు అన్ని మతస్థుల వారందరును పరమేశ్వరుని బిడ్డలని తలంచి అందరితోను కలసి మెలసి యుండుము. ద్వేషము వదలుము. విశ్వమానవుల పట్ల సౌభ్రాతృత్వము చూపుము. సమస్త ప్రాణులను ప్రేమింపుము. అప్పుడు శాంతి సౌఖ్యములననుభవించెదవు. బ్రహ్మస్వరూపిణి యగు జగజ్జనని దర్శనము నొందగలవు. నీలోజ్ఞాన దీపము వెల్గింపుము. నీ స్వస్వరూపమును దర్శింపగలుగుదువు. అనగా ఆత్మ సాక్షాత్కారము నొందగలవు.”

**శ్రీ రామకృష్ణ పరమహంస**

# భక్త రక్షకుడు భగవంతుడు మాత్రమే!

మూలం : స్వామి రామదాస్ అనువాదం : గరిగిపాటి కృష్ణ

## నామము ద్వారా భగవంతుడిని పొందవచ్చు

బిజాపూరు నవాబు వారి రాజ్యంలో, మంగళవేధ అనే తాలూకా, ఒకానొక రెవెన్యూ అధికారి పర్యవేక్షణలో ఉండేది. అతని పేరు దామాజి. అతడు విఠోబాను ఎంతో భక్తితో ఆరాధించేవాడు. ఆ రోజుల్లో సర్కారు వారి సుంకము మరియు అద్దెలు నగదు రూపంలో కాక ధాన్యము, గోధుమల రూపంలొ వసూలు చేసి అలా వసూలుచేసిన ధాన్యాన్ని ప్రభుత్వ గోదాముల్లో భద్రపరచేవారు. అలా భద్రపరచిన ధాన్యంతో మంగళవేధ తాలూకాలోని గోదాములన్నీ నిండిపోయాయి. తరువాతి కాలంలో ఒక ఏడు సంభవించిన భయంకరమైన కరవు కాటకాల వల్ల ప్రజలు తిండి లేక మాడవలసిన దుస్థితి కలిగింది. అప్పుడు వారంతా దామాజి వద్దకు వచ్చి తమకు ఈ కష్టకాలంలో సహాయపడమని అర్థించారు. వెంటనే దామాజి తన వద్ద యున్న ధాన్యము పంచివేయడమేకాక సర్కారువారికి చెందిన గోదాములలోని ధాన్యాన్ని కూడా అన్నార్తులకు పంచిపెట్టించాడు. దామాజి వద్ద పనిచేసే పెద్ద గుమస్తా తన పై అధికారి చేసిన మంచిపనిని సహించలేక అసూయతో ఎలాగైనా తాను దామాజిని పదవి నుంచి తప్పించగలిగితే, తనకు ఆ పదవి దక్కుతుందని ఆశ పడ్డాడు. అతడు బిజాపూరు నవాబుకు దామాజి సర్కారు గోదాములలోయున్న యావత్తు ధాన్యాన్ని ప్రజలకి పంచివేసాడని వర్తమానము పంపిస్తాడు. ఈ విషయం తెలిసి, నవాబు తన రక్షక భటులను వెంటనే వెళ్ళి దామాజిని బంధించి తన వద్దకు తీసుకొని రావలసినదిగా ఆదేశిస్తాడు. రక్షకభటులు మంగలవేధ చేరేసరికి, దామాజి భగవన్నామ సంకీర్తనలో మునిగియున్నాడు. భటులు అతనిని సంకీర్తన ఆపి తమతో రావలసిందిగా చెప్పారు. దామాజి తనవారితో నవాబుగారు ఏదో అత్యవసరంగా తనను రమ్మన్నారని చెప్పి, వెంటనే భటులతో కలసి నవాబు వద్దకు ప్రయాణమయ్యాడు. తన భక్తుడు ఆపదలో చిక్కుకొని యుండడము చూసి భక్తసులభుడైన విఠోబా అతనిని రక్షించదలచాడు. వెంటనే విఠోబా ఒక మాలవాని వేషం ధరించి నవాబు ముందుకు వెళ్ళి, "నేను దామాజి సేవకుడను. అతడు పన్నులకు బదులుగా పసూలు చేయబడిన మొత్తము ధాన్యమునకు సమానమైన విలువ కట్టి ఆ ధనము నాతో పంపాడు." అప్పుడు నవాబు ఇలా అన్నాడు, "దాని విలువ లక్షలలో ఉంటుంది. నీవు అంత సొమ్మును ఏవిధంగా చెల్లించగలవు? నువ్వు తెచ్చానని చెప్తున్న ధనమెక్కడ ఉంది?" అని అడిగాడు. దానికి బదులుగా ఆ మాలవాడు, ఇదిగో, ఇక్కడే నా దగ్గరే ఉంది. మీరు ఈ సంచిలో ఉన్న పైకము మొత్తంగా తీసుకోవలసిందని అన్నాడు. అలా అంటూ అతడు తన చేతిలో యున్న ఒక చిన్న సంచిని నవాబు గారికి అందచేసాడు. అప్పుడా నవాబు ఆ సంచిని ఖాళీ చేయించి దానిలోయున్న ధనాన్ని లెక్కించాడు. అందులో ఉన్న ధనము సరిగా దామాజి వద్ద నుండి తనకు రావలసిన మొత్తానికి సరిపోయింది. మాలవాడు కోరిన విధంగా, నవాబు పైకము ముట్టినట్లుగా రసీదు వ్రాయించి ఇచ్చాడు.

నవాబు ఆ మాలవాని మెరిసేకళ్ళు, ప్రకాశవంతమైన ముఖకవళికలు, అందమైన రూపమూ చూసి ఎంతో ఆశ్చర్యానికి లోనయ్యాడు. నవాబు ఆ అగంతకుని పేరు అడిగితే, అతడు, "నేను కేవలము దామాజి వద్ద పనిచేసే పేద సేవకుడను. నా పేరు విఠూ

మహర్," అంటూ అక్కడినుండి అదృశ్యయమ్యాడు. ఆతని రూప లావణ్యాలను మరిచిపోలేని నవాబు మతిభ్రమించిన వానిలా అతనికోసం అన్ని చోట్లా వెదికాడు. కాని అతని జాడ తెలియరాలేదు. నవాబు తనకు విఠూ మహర్ కనిపించే వరకు అన్న పానీయాలను ముట్టబోనని కరాఖండీగా చెప్పాడు. రెండు, మూడు రోజులు ఇలా గడిచాయి. అప్పుడు రక్షకభటులు దామాజీని నవాబు వద్దకు తీసుకొనివచ్చారు. అంత నవాబు ఆశ్చర్యమునకు లోనై దామాజీతో, "నువ్వెందుకు వచ్చావు? నీపై ఎటువంటి అభియోగము లేదే. ఖజానాకు రావలసిన సొమ్ము అణా పైసలతో సహా మూడ్రోజుల క్రితమే తీర్చివేశావు కదా! నీ సేవకుడైన విఠూమహర్ ద్వారా సొమ్ము మొత్తం పంపించివేసావు కదా", అంటాడు. అయితే ఎలాగూ వచ్చావు కనుక నేను నీ సేవకుడిని మళ్లీ ఒకసారి చూడాలనుకొంటున్నాను. అతనెక్కడ? అని దామాజీని ప్రశ్నిస్తాడు.

దామాజి: నేను మీకు ఏ విధమైన ధనాన్ని ఇచ్చి ఉండలేదు. అలాగే నాకు విఠూ మహర్ అనే పేరు గల సేవకుడు ఎవ్వరూ లేరు."

నవాబు: "అదెలా సంభవము? అతడు ధాన్యానికి బదులుగా ధనాన్ని మొత్తంగా నాకు చెల్లించి, నా వద్దనుండి సొమ్ము ముట్టినట్లుగా రశీదు కూడా అడిగి తీసుకొని వెళ్ళాడే," అన్నాడు.

నవాబు చెప్పిన దానికి దామాజి ఎంతో ఆశ్చర్యానికి లోనయ్యాడు. ఆ సమయములో అతని చేతిలో శ్రీ కృష్ణుని భగవద్గీత ఉంది. అందులోనుండి ఒక కాగితము రెపరెపలాడుతూ కనిపించింది. నవాబు అది ఏమిటని దామాజీని అడిగాడు. దామాజి ఆ కాగితాన్ని బయటకు తీసి చూస్తే అది నవాబు విఠూ మహర్‌కి ఇచ్చిన రశీదు.

నవాబు: "నీవు విఠూ మహర్ ఎవరో నీకు తెలియదని బుకాయించావు. అలా అయితే ఆ రశీదు నీ వద్దకు ఎలా వచ్చింది? అందుచేత నీకు అతని గురించి తప్పకుండా తెలిసే ఉంటుంది. దామాజీకి ఏమీ బోధపడలేదు. నవాబు గారికి ఎలా నచ్చచెప్పాలో అర్థం కాలేదు.

నవాబు: "నేను ఇప్పుడే విఠూ మహర్ ని చూడాలనుకొంటున్నాను. నీవు తప్పనిసరిగా అతనిని నాకు చూపించాలి!"

దామాజి: "ప్రభూ!నీవు నన్నొక ఆపద నుండి తప్పించి మరొక ప్రమాదంలోకి నెట్టివేసావు. ఇది నీకు భావ్యమా? నవాబు ఎలాగైనా విఠూ మహర్‌ని చూడాలని పట్టు పడుతున్నాడు. నేనే ఎన్నడూ చూడని వానిని వేరొకరికి ఎలా చూపగలను?"

అప్పుడు దామాజి నవాబు గారిని వెంట తీసుకొని పండరీ పురమునకు వెళ్లి అక్కడ విఠోబా దర్శనం చేయిస్తాడు. ఇద్దరూ విఠలుని విగ్రహానికి ఎదురుగా నిలబడ్డారు.

నవాబు: "నేను రాతి విగ్రహాన్ని చూడడానికి రాలేదు. నేను విఠూ మహర్నే చూడాలి. నీవే నాకు అతనిని చూపించాలి."

అప్పుడు విఠలుడు వారిద్దరికీ విఠూ మహర్ రూపంలో దర్శనమిస్తాడు. ఏ మాలవాడైతే నవాబుకు ధనమిచ్చాడో ఆ విఠూ మహరే అక్కడున్న విగ్రహానికి బదులుగా దర్శనమిచ్చాడు. అలా భగవంతుడు తన భక్తుని రక్షించడమేకాక నవాబుకు కూడా దుర్లభమైన తన దర్శన భాగ్యాన్ని కలుగచేసాడు. అనంతర కాలంలో మంగళవేఢలో దామాజి మరియు నవాబుల సమాధులు పక్కపక్కనే ఏర్పాటు చెయ్యబడ్డాయి.

# తత్త్వమసి

శ్రీ తెన్నేటి విశ్వనాథం

(క్రిందటి సంచిక తరువాయి)

**సూ॥** ఓం. ఆప్యాయన్తు మమాంగాని వాక్ప్రాణశ్చక్షు
శ్రోత్రమథో బలమింద్రియాణిచ సర్వాణి ।
సర్వం బ్రహ్మోపనిషదం మాహం బ్రహ్మ
నిరాకుర్యాం మా మా బ్రహ్మ నిరాకరోవ
నిరాకరణ మస్త్వనిరా కరణం మే స్తు ।
తదాత్మని నిరతే య ఉపనిషత్సు ధర్మాస్తే
మయి సంతుతే మయి సంతు ।

**1వ ఋ॥ కు॥** ఓం, చూచితివిగదా. అస్మద్గురువరేణ్యులు చెప్పినది ?

**3వ ఋ॥ కు॥** సరి సరి, వింటివిగదా అని అడుగకూడదా ?

**1వ ఋ॥ కు॥** ఆలాగుననే కానిమ్ము. వట్టిఛాందసుడవు నీవు,

**3వ ఋ॥ కు॥** అస్తు, ఏమని అంటిరో చెప్పుమయ్య.

**1వఋ॥కు॥** ''అంటిరో'' అని అనుచున్నావు, వారినోటివెంట వచ్చు ప్రతివచనము మహావాక్యమని తెలియునా ?

**3వ ఋ॥ కు॥** భవతు, చెప్పుము, మననము చేసికొందము.

**3వ ఋ॥ కు॥** శ్రద్ధగ వినుడు సర్వం ఖల్విదం బ్రహ్మ తజ్జలానితి

**1,2,4 ఋ॥ కు॥** ధన్యావయం, ధన్యావయం, సర్వ ప్రపంచము జన్మస్థితిలయములను బ్రహ్మమునందే గనుచున్నది.

**3వ ఋ॥ కు॥** ఇది సత్యస్య సత్యం,

**4వ ఋ॥ కు॥** అందులకనియే, జన్మించిన మనము భుజించు వేళల ప్రత్యగాత్మ స్వరూపమును, సర్వాత్మక వైశ్వానర రూపముగ భావింపవలెను.

**1వ ఋ॥ కు॥** అవును. అట్లయినచో సమస్త భూతములును తృప్తిపొందును.

**3వ ఋ॥ కు॥** సరిలే. మనమాటకేమిగాని బ్రహ్మభూతులు ఉద్దాలకమహర్షిగారి కుమారుడు శ్వేతకేతువు బ్రహ్మచర్యముగడిపి తిరిగివచ్చినాడు. విన్నావా ?

**1వ ఋ॥ కు॥** వినుటేగాదు, చూచితినికూడ. మనలను విడిచి పెట్టి వెళ్లిన తరువాత చాల మారినాడాతడు.

**2వ ఋ॥ కు॥** క్రిందటి సంవత్సరము ప్రాచీనశీల మహర్షి ఆశ్రమమునకు విద్వత్సంవాదమునకు వచ్చిన ఆతడేనా ?

**3వ ఋ॥ కు॥** ఆc, ఆc, ఆతడే

**2వ ఋ॥ కు॥** అబ్బబ్బో, ఎంతగర్వి, చూపులో గర్వము. మాటలో గర్వము, నడకలో గర్వము.

**3వ ఋ॥ కు॥** దాని కేమి లెండు, గురుకుల వాసానంతరము సంప్రదాయముగ గురువులిచ్చు ప్రశంసలను పొందిన ప్రతివారికి ఓ నాలుగు దినములపాటు గర్వదేవత ఆవహించుచుండును. కాని, బాగుగ అధ్యయనము చేసినట్లేయున్నది. కావ్యాలంకార శాస్త్రనిధి అని చెప్పక తప్పదు.

**1వ ఋ॥ కు॥** సరిలెండు. కావ్యము, అలంకారము వీనికి గురుకులవాసమెందుకు? ఏ సెలయేటిఒడ్డునో కూర్చున్నయెడల ఆ ఏటి జలజలలు, ఏటిపై వంగియున్న చెట్లకొమ్మలు, కొమ్మల మధ్య నుండి పక్షులాలపించు తేటగీతులు, ఉదయాస్తమయ సమయముల గగనమున కన్పడు అరుణ ప్రభలు, అందు కదలాడు హంసల తెలుపులు, మొదలగునవి కావలసినన్ని కవిరాజ విరాజితములై నేర్పగలవు. కృతకమైన అలంకారముల మించి, ఏ కవి అలంకారములను సృష్టి చేయగలడు!

**2వ ఋ॥ కు॥** అట్లయిన ?

**3వ ఋ॥ కు॥** నీవెవరు, నేనెవరు, వారెవరు, ఎక్కడనుండి వచ్చితిమి, ఎక్కడకు పోవుదము. ఆ ప్రకృతి దేనినుండి వచ్చినది; ఎంతవరకు ఉండును ఆత్మ అంటే ఏమిటి ? పురుషార్ధము ఏది అని ఇందులో ఏదో ఒక ప్రశ్న అడిగినచో అయ్యగారి ప్రతిభ బయలుపడగలదు.

(ఒక వైపు తెరలోనికి చూచుచు)

**1వ ఋ॥ కు॥** చూడుడు. ఆ త్రోవనుండి వెళ్లుచున్న ఆయనేగదా శ్వేతకేతువు ?

**2వ ఋ॥ కు॥** ఆయనే, కనబడలేదా, ఆ తెల్లని పతాకము అతని భూజముపై దండాగ్రమున ఎగురుచున్నది.

**2,3 ఋ॥ కు॥** పదండి, మనముకూడ ఒకమారు ఉద్దాలక మహర్షికి నమస్కరించి ఆశీర్వాదమును గైకొందము (అందరు నిష్క్రమింతురు, తెరదిగును)

తత్త్వమసి

# రంగము

**స్థలము-ఉద్దాలఋషి కుటీర ప్రాంగణము.**

**(ప్రవేశము- శ్వేత కేతువు, ఋషి కుమారులు)**

**శే॥** దయచేయుడు, దయచేయుడు.

**ఋ॥** అభివాదమభివాదము, బహుకాలదర్శనప్రాప్తి.

**శ్వే॥** అవునవును, నాగురుకులవాస సమయమందే అనేక విద్వత్సభలలో నే పాల్గొనవలసి వచ్చినది. మా గురువుగారు సాధారణముగ నన్నే వారివంతు పంపించుట పరిపాటయినది. వారు బహుళశ్రుతులు ఆహితాగ్నులగుటచేత....

**ఋ॥ కు॥** బాగు బాగు శిష్యుడు తెలివి తేటలుగలవాడయిన యెడల నందు తప్పేమి

**శ్వే॥** అవును ఈమధ్య అశ్వతరపతి అనే రాజుగారి సభ యందు అందరు, గురువునుమించిన శిష్యుడు అని నన్ను ప్రశంస చేసినారు. (ప్రవేశము- ఉద్దాలకమహర్షి. అందరు వారిపాదములకు మ్రొక్కి ఒకమారు తమతమ పేరు చెప్పుచు)

**ఋ॥** అహం దేవదత్తశర్మాహంభో అభివాదయే.

**విష్ణు॥** అహం విష్ణుశర్మా అహంభో అభివాదయే.

**శ్వే॥** అహం శ్వేత కేతుః అహంభో అభివాదయే.

**జ॥** దీర్ఘాయుష్యమస్తు, ఏమి ఋషికుమారులు నలువురు ఒకేమారు వచ్చినారు ?

**ఋ॥** చిరకాలమిత్రుడు శ్వేత కేతువు గురకులవాసము నుండి విఖ్యాతుడై మరలి వచ్చినాడన్న మాట విని వానినిచూచి, తమ ఆశీస్సుల నందుకొనుటకు వచ్చినాము.

**ఉ॥** చెప్పుడు-సహనావవతు....

**ఋ॥** (సుస్వరముగ) - సహనావవతు...

**ఉ॥** నాయనా, శ్వేతకేతూ, నీవుకూడ స్వరమ కలుపుము.

**శ్వే॥** లేదు, నాయనగారూ, ఏదో వీరు చిన్నవారు. వారిని కానిండు

(ఋ॥ కు॥ సహనావవతు. సహనౌ,భునక్తు, సహ వీర్యం కరవావహై, తేజస్వినావధీతమస్తు, మవిద్విషావహై)

(ఉద్దాలక మహర్షి కూడా స్వరములిపి) ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

ఉ॥ కుమార, శ్వేతకేతూ. నీవు అతి ప్రవచన సమర్థువని నీవిప్పుడు చెప్పిన మాటనుబట్టి ఇతరులనుకొనుటకు అవకాశ మిచ్చితివి. మంచిదికా దట్టిసర్వజ్ఞ ప్రకటనము. సరి అది అటుండనిమ్ము. దీనిని చెప్పుము. శాస్త్రాచార్యోపదేశమువలన ఈవిషయము గురువులను సేవించి అడిగి తెలిసికొంటివా ?

శ్వే॥ ఏది, అది ?

ఉ॥ దేనిని గ్రహించుటవలన, వినుటకు వీలుగాని విషయము వినినదానివలె విస్పష్టమగునో మననమునకి వీలు లేని విషయము మననమయిన దానిని విస్ఫుటమగునో, తెలియుటకు వీలుకాని విషయము తెలిసినదానివలె నిశ్చితమగునొ దానిని గ్రహించితివా ?

శ్వే॥ నాన్నగారూ, అదెట్లు సంభవము కాగలదు !

**2వ ఋ॥ కు॥** (తనలోతాను) తండ్రిగారి ప్రశ్ననే అసంభవమను చున్నాడేమీ ?

**3వ ఋ॥ కు॥** (2వ ఋ॥కు॥తో) మాట్లాడకుము, మహర్షులు అది ఎట్టులో చెప్పబోవుచున్నారు.

ఉ॥ వినుము. (ఒకవస్తువును చూపుచు) ఏమిటీ వస్తువు ?

శ్వే॥ ఇది మట్టిముద్ద.

ఉ॥ చూడు, ఆ మూలనున్నవి ఏమిటవి ?

శ్వే॥ అవి కుండలు.

ఉ॥ అవి దేనితో చేయిబడినవి?

శ్వే॥ మట్టితో

ఉ॥ కాబట్టి మట్టి అసలువస్తువు. దానితో చేసిన కుండ కూడ మట్టియేకద!

శ్వే॥ అవును.

ఉ॥ కాని దానికి "కుండ" అని పేరుమాత్రము వేరు, అంతేనా ?

శ్వే॥ అవును.

ఉ॥ కారణవస్తువైన మన్నునిత్యము, కార్య వస్తువైన కుండ అనిత్యము. నిత్మమైనదానితో కండ చేసిన రీతిగనే అనేకములయిన వస్తువులను చేయవచ్చును. పెక్కు పేర్లతో పిలువవచ్చును, అవి అనిత్యములు మన్ను ఒక్కటే నిత్యము. పేరులు వాగ్వ్యాపారార్థములు.

శ్వే॥ అవును భగవాన్.

ఉ॥ నిత్యమయినదానినే సత్యము అని అనెదరు, అనిత్య మైనదానినే అసత్యము అని అనెదరు.

శ్వే॥ చిత్తము ( అనిశ్రద్ధగా తండ్రి వైపుచూచును.)

**3వ ఋ॥ కు॥** (ఇతర ఋషికుమారులతో) ఏమి తేటదనము ఎంతటి రహస్యము ఇంతటి సులభమైన పల్కులతో చెప్పిరొ చూచితిరా! మహనీయులు ఉద్దాలక మహర్షులు

**2వ ఋ॥కు॥** (ఇతరఋ॥కు॥లతో) ఇప్పుడు ఈ శ్వేతకేతువునకు శ్రద్ధ కుదురుచున్నట్లున్నది.

ఉ॥ (పూజాపేటికనుండి ఒక వస్తువుతీసి) – చూడుము శ్వేతకేతూ ఏమిటీవస్తువు.

శ్వే॥ ఇది ఒక బంగారు కణిక.

ఉ॥ చూడుము వీనిని, ఏమిటివి ?

శ్వే॥ ఇది బంగారముతో చేసిన ఉంగరము. ఇవి బంగారు కుండలములు, ఇవి బంగారు కంకణములు, ఇది బంగారు అందె.

(సశేషము)

# ప్రేమ ఉన్న జీవితం

**ప్రేమ నిండిన జీవితం**
**అందమైన మేడలాంటిది**
**ఆ మేడ మెట్లు**
**ప్రేమ నిండిన మెట్లు**
**అనురాగాలు నిండిన మెట్లు**
**ప్రశాంతత నిండిన మెట్లు**
**గెలుపులో వినయాన్ని**
**ఓటమిలో సహనాన్ని**
**ప్రవహింప చేసేది**

**ప్రేమ నిండిన జీవితం**
**పగలు అయినా**
**మధ్యాహ్నం అయినా**
**సాయంత్రం అయినా**
**చీకటి అయినా**
**ఎప్పుడూ ఒకలాగే ఉంటుంది**
**ప్రేమ నిండిన జీవితం**

**ఎమ్.ఎస్. రంగారావు (బన్ను)**

# శ్రీ తులసీ సర్వస్వము

అధ్యాయము - 2 జి.వి.ఎస్. సుబ్రహ్మణ్యశర్మ

## 15. తులసి మహావృక్షము

## తులసి మాలను ధరించినవాడు విష్ణువుకు ప్రీతి పాత్రుడగును

### కృష్ణతులసి (జంబీరః)

శ్లో॥ జంబీరః ఖరపత్రశ్చ ఫణీచో క్తః ఫణిజ్ఞకః ।
మరుత్తకో మరువకో మరుమారీచక స్తథా ।
తీక్ష్ణగంధో ర్జుకశ్చైవ మంజరీక స్సుగంధకః ॥

టీక॥ జంబీర, ఖరపత్ర, ఫణి, ఫణిజ్ఞక, మరుత్తక, మరువక, మరుత్తక, మరువక, మారీచక, తీక్ష్ణగంధ, అర్జుక, మంజురీ, సుగంధిక అను ఇవన్నీ కృష్ణతులసి పేర్లు అని వస్తుగుణదీపిక పేర్కొనినది.

### ఇ. తులసిని నాటుటకు తిధినిర్ణయము.

శ్లో॥ శుక్లపక్షే యదా రాజన్! తృతీయ బుధసంయుతః।
శ్రావణేన మహాభాగ ! తులసీ చాతిపుణ్యదా॥

(స్కాందపురాణము)

తా॥ శ్రావణ మాసములోని శుక్లపక్షమునందలి తదియనాడు బుధవారము కూడ కలిసివచ్చినచో, ఆ రోజున తులసిని నాటుట మంచిది. అది మిక్కిలి పుణ్యదాయకమగును. అని స్కాందపురాణము చెప్పుచున్నది.

### ఎఫ్. నిత్యపూజకు తులసి ఎట్లు లభించును ?

శాస్త్రములును, పెద్దలును అంగీకరించిన తిధులయందు తులసిని కోసి, దాచియుంచుకొనుట వలన,తులసి నిత్యమును మన పూజల కందుబాటులో నుండును.

అవతారికః తులసిని కోయకూడని నమయము ఇకముందు తెలుపబడును! మరి ఆ రోజులలో తులసి లేకుండా పూజ ఎట్లు కొనసాగును? అను ప్రశ్నకు సమాధానము ఈ క్రింది వాక్యములయందు తెలుపబడినది.

శ్లో॥ త్రిరాత్రం తులసీపత్రం శుద్ధం పర్యుషితం సతి।
శ్రాద్ధే, వ్రతేచ దానేచ ప్రతిష్ఠాయాం సురార్చనే
భూగతం తోయ పతితం మద్దత్తం విష్ణవే నతి
శుద్ధంచ తులసీపత్రం క్షాళనా దస్య కర్మణే ॥

తా ॥ తులసీదళముయెక్క పావిత్ర్యము ఇట్లు తెలుపబడినది. శ్రాద్ధములు వ్రతములు, దానములు దేవతా ప్రతిష్ఠలు, దేవపూజలు, మొదలగు వానిని నిర్వర్తింప వలసినప్పుడు మూడురాత్రులక్రింద కోయబడిన, పాచిదైన తులసీదళము కూడ పవిత్రమైనదే అగును! తులసి ఆకు నేలపై బడినను దానిని కడిగి, తిరిగి విష్ణువునకు సమర్పింపవచ్చును. నేలపైపడిన ఏ ఇతరపదార్థము భగవదర్పణ యోగ్యము కాదు.

## జి. తులసిని ఎప్పడు కోయవలెను ?

**శ్లో॥ అస్నాత్వా తులసీం ఛిత్వి యః పూజాం కురుతే నరః ।**
**సో2పరాధీ భవేత్ సత్యం తత్ సర్వం నిష్ఫలం భవేత్ ॥**

(వాయుపురాణము)

తా॥ స్నానము చేయకుండ తులసిని కోసి, ఏ మానవుడు భగవంతుని పూజించునో, అతడు అపరాధి యగును. అంతేకాక అతడు చేసిన పూజ అంతయు నిష్ఫలమయిపోవును. అనుట పరమసత్యము. కనుక తులసిని స్నానము చేసిన తరువాతనే కోయవలెను. దేవకార్యముల కొఱకును, పితృకార్యక్రమముల కొరకును, స్నానము చేసిన తరువాత తులసిని కోయవలెను.

**సాలగ్రామ శిలార్చార్థం ప్రత్యహం భక్తిసంయుతః ।**
**తులసీం యే విచిన్వంతి ధన్యాస్తే కరపల్లవాః ॥**

ఈ భూమిమీద సాలగ్రామశిలను పూజించుకై ప్రతిదినము తులసిని కోయువాని కరపల్లవములు (చిగురాకు వంటి చేతులు) ధన్యము లగును.

**శ్లో॥ సంక్రాంతౌ నిశీథే2పి తులస్యావచయః స్మృతః ।**

(విష్ణుధర్మోత్తరము)

సంక్రాంతి పర్వదినములయందును, అర్ధరాత్రి సమయములయందును కూడా తులసిని కోయవచ్చునని పెద్దలు అంగీకరించిరి. అని విష్ణుధర్మోత్తరపురాణము పేర్కొనినది.

## హేచ్. తులసిని కోయు సమయమున చెప్పవలసిన మంత్రము

**శ్లో॥ మెక్షైకహేతో । ధరణీప్రశస్తే ।**
**విష్ణోః సమస్తస్య గురోః ప్రియేతి ॥**
**ఇత్యుక్త్వా తులసీం నత్వా, ఛిత్వా దక్షిణపాణినా ।**
**సత్రా ణ్యేకైకశో పాత్రే న్యశే ద్వై మంజరీరపి ॥**

(గరుడపురాణము)

తా॥ మెక్షమును ఇచ్చుటకు ఏకైక కారణమయినదానా ! భూమండలములో ప్రశస్తమైన వృక్షరాజమా ! సమస్త విశ్వమునకు గురువైన శ్రీ మహావిష్ణువునకు ఇష్టమైనదానా!" అను మంత్రమును చదువుచు తులసీదేవికి ముందుగా నమస్కరించుచు కుడిచేతితో తులసీదళమును, మంజరులను (వెన్నులను, ఒకొక్కటి కోసి, పాత్రలో వేసికొనవలెను. తులసిని పురుషులే కోయవలెను కాని స్త్రీలు కోయరాదు.

శ్లో ॥ **మాతః తులసి । గోవింద హృదయానందకారిణి ।**
**నారాయణస్య పూజార్థం ఛినోమిత్వాం నమో2స్తుతే ॥**

అమ్మా తులసీ ! శ్రీకృష్ణుని హృదయానందమునకు కారణమైనదానా ! నారాయణుని పూజించుటకొఱకే నిన్ను త్రుంచున్నాను. నీకు నమస్కారము

శ్లో॥ **తుల స్యమృతజన్మాపి సదా త్వం కేశవప్రియే ।**
**కేశవార్థే ఛినోమి త్వాం వరదా భవ శోభనే ॥**

(పద్మపురాణము-63-11-13)

తా॥ ఓ తులసీదేవీ! నీవు అమృతమునుండి పుట్టినదానవు. అమృతమును కన్నతల్లివికూడా నీవే, కేశవునకు ఎల్లప్పుడు ఇష్టమైనదానవు నీవు. ఆ కేశవుని పూజకొరకే నీ దళమును త్రుంచుచున్నాను. ఆ బాధను సహించి పరమశుభప్రదురాలవు కనుక నాకు వరమును ప్రసాదించుము.

మనస్సు తానున్న ప్రదేశములో స్వర్గమును నరకముగను, నరకమును స్వర్గముగను మార్చగలదు. కావున స్వర్గనరకముల సృష్టికర్తలము మనమే! మనకు సంభవించిన ప్రతివిషయము మన మంచికేనని భావించాలి. ప్రేమ, దయ, కనికరములకు ఆలవాలమై యున్న భగవంతుని శక్తిచే ప్రతీది నిర్ణయింపబడును. విషయాలను తప్పుగా భావించి మనం దుఃఖపూరితుల మగుచున్నాము. బాహ్య జీవితములో మనం నిరంతరం భగవంతుని స్ఫురణ యందుంచుకొనుట వలన మనకు సమ్యక్ దృష్టి కలుగును.

**స్వామి రామదాసు**

# భగవత్ కృప

మూలం : శ్రీ అఖండానంద సరస్వతీ          అనువాదం : శ్రీమతి టి. ఛాయాకృష్ణ

## సంతోషము వలన ముక్తి లభిస్తుంది.

(గతసంచిక తర్వాత)

శ్రీ శుకదేవుడు పరీక్షితునితో నిట్లనియె – రాజా! బలి మాటలను విని వామనుడు చాల ప్రసన్నుడయినాడు. ఓహో! ఓహో! ఓహో! అని ఆనందంగా అన్నాడు. రాజన్! మీ వంశంలో ఎటువంటి వారు వుండే వారు. అందువలననే మీరు కూడా ఇటువంటి మధురమైన, ధర్మయుక్తమయిన మాటలు మాట్లాడుతున్నారు. ధర్మవిషయములో మీరు మీ పితామహుడు ప్రహ్లాదుని ఆజ్ఞనే ప్రమాణము తీసుకుంటారు. ఇది ఉచితమే. మీ వంశములో కృపణులు, నిస్సత్వులు ఎవరూ లేరు. వామనుడు బలిని ఇంకా కొంచెం దృఢము చేయాలన్న ఉద్దేశ్యముతో ఇట్లనెను–యజ్ఞములో బ్రహ్మణులకు ఒకసారి ఏదైన ఇస్తామని సంకల్పము చేసి చెప్పిన తర్వాత మరల మాటను తిరిగి తీసుకొనేటటువంటి వారు మీ వంశంలో ఎవరూ లేరు. ఎవరైనా ఏదైనా ఇస్తామని చెప్పి ప్రతిజ్ఞ చేసి మరల ఇవ్వకపోతే వారి ఇంటిలో ఏ విధమైన మంగళములు జరుగవు. విచారము, హాని చాల కలుగుతుంది. మీ వంశములో అకృపణులు ఎవరూ లేరు. దానము, యుద్ధము వీటితో పరాంఙ్ముఖులైన వారు లేరు. మీ పూర్వజుడైన ప్రహ్లాదుని కీర్తిని గురించి ఇక చెప్పవలినదేమున్నది ? అతని పెదతండ్రి అయిన హిరణ్యాక్షుడిని విష్ణుభగవానుడు జయించినాడే కానీ ఎప్పుడయినా ఆతని పరాక్రమము గుర్తువస్తే గుండెలుదడదడలాడేవి. నేను నిజంగానే గెలిచానా అని అనుకునేవాడు. తన సోదురుని విష్ణువు చంపేశాడని తెలియగానే హిరణ్యకశిపుడు గద తీసుకుని ఆతనికై వెతుకసాగాడు. ఎక్కడ దాగుకోవాలా అన్నది సమస్య అయినది విష్ణు భగవానునికి. హిరణ్యకశిపుని శ్వాసతో కలసి విష్ణువు అతని హృదయములో కూర్చున్నాడు అప్పుడు హిరణ్య కశిపుడు విష్ణువు మరణించాడని ఎంచి వెదకడము మానేశాడు. మీ తండ్రి విరోచనుడు కూడా మరణించాడు కాడు. దేవతలు బ్రాహ్మణులై అతని ఆయువును యాచించారు. అతడు అది కూడా ఇచ్చివేశాడు. అటువంటి వంశములో మీరు జన్మించారు. నేను మీతో ఏదో పెద్ద వస్తువును ఏమని అడుగను? నాకు కేవలము మూడు అడుగుల నేల మాత్రమే కావాలి' అని అన్నాడు వామనుడు.

వామనుడు మూడడుగుల నేలనడిగాడు. ఇందులో జాగ్రదవస్థ, స్వప్నావస్థ, సుషుప్త్యావస్థ ఈ మూడూ యాచించాడు. ఇక మిగిలినదేమిటి? కేవలం పరమాత్మయే

పరమాత్మ వున్నాడు. అందుకే వామనుడు మూడు స్థానములను అడిగాడు. 'ఇంతకంటే మాకు వేరే ఏమీ వద్దు. మీరు చాల గొప్ప దాతలు – 'నాన్యత తే కామయే రాజన్వదా న్యాజ్జగదీశ్వరాత్' (17) వామనుడన్నాడు నాకు ఎక్కువ ఏమీ వద్దు. ఎంతటితో మన పని గడుస్తుందో, ఎంత మాత్రం ప్రయోజనమో అంతే దానం తీసుకోవాలి "యావదర్ధ ప్రతిగ్రహః' (17) దీనివలన ప్రతిగ్రహము తీసుకునేవాడికి పాపమంటదు.

బలి అన్నాడు 'వామనా! నీవు మాటలైతే పెద్ద వారిలా మాట్లాడుతున్నావు. కానీ నీకు నీ స్వార్థమంటే ఏమిటో తెలియదు. నేను నీ పై ప్రసన్నుడనై వుండగా నీవు కేవలము మూడడుగులు అడుగుతున్నావు! ఎంత భూమి తీసుకోవడం వలన జీవిక నడుస్తుందో కనీసం అంతమాత్రమైనా నా నుండి తీసుకో. వామనుడన్నాడు–మీరు నాకు జగత్తులోని సమస్తములైన విషయములను ఇచ్చినంత మాత్రమున నన్ను తృప్తి పరచగలరా? ఒక వేళ నాకు మూడడుగులతో తృప్తి కలుగకపోతే సమస్త ద్వీపమును తీసుకున్నా నాకు సంతోషము కలుగదు. గయుడు, పృథువు మొదలైన గొప్ప గొప్ప చక్రవర్తులకంతా సంతోషము తృప్తి కలిగినదా ఏమి? అందువలన ఎంత వున్నదో అంతలో తృప్తి పడవలెను. సంతోషము వలన ముక్తి లభిస్తుంది. బ్రాహ్మణుడు సంతుష్టుడై వుండాలి. అసంతోషమన్నది అగ్ని. అది భస్మము చేసివేస్తుంది. 'విత్తం యావత్ ప్రయోజనమ్' (27) ఎంత మాత్రముతో మన ప్రయోజనము సిద్ధిస్తుందో అంతమాత్రమే ధనముండాలి. అంతకంటే ఎక్కువ వుండకూడదు. ఇక బలి నవ్వుతూ సరే మంచిదే మహాత్మా! మీ ఇష్టం వచ్చినదే తీసుకోండి అని అన్నాడు. తర్వాత బలి సంకల్పము చేసికొనుటకు జలపాత్ర చేతిలోకి తీసుకున్నాడు. ధర్మశాస్త్రము యొక్క మర్యాద ఇది – ఏ కర్మ సంకల్ప పూర్వకముగా కర్తృత్వ పూర్వకముగా చేయ బడుతుందో, అదే ఫలప్రదమవుతుంది. ఎక్కడ సంకల్పము లేదో, కర్తృత్వమే లేదో అక్కడ ఫలము ఎక్కడి నుండి వస్తుంది? ఫలితము కర్మలోనుండదు. కర్తృత్వము సంకల్పము వీటిలోనే ఫలితము వుంటుంది. అందువలన బలి జలము తీసుకుని తయారైన్నాడు. ఇంతలో బలి యొక్క గురువు శుక్రాచార్యుడు అంతా అర్థము చేసుకున్నాడు – ఈ వామనుడు విష్ణు భగవానుడు. ఇంద్రుని పని చేసిపెట్టేందుకు అతని సోదరుడై వచ్చాడు. నీవు ఇతనికి మాట ఇచ్చి చాల అన్యాయం చేశావు. ఇతడు నీదంతా లాక్కుని ఇంద్రునికి ఇచ్చివేస్తాడు. విశ్వము ఇతని శరీరము ఇతడు తన మూడు అడుగులతో సకల లోకములను కొలచివేస్తాడు. నీకు వుండటానికి, తినడానికి కూడ చోటు వుండదు. దాత యొక్క జీవికకు నష్టము కలుగనంతవరకే దానం చేయాలి. ఈ వామనుడు తన ఒక అడుగుతో మొత్తం భూమిని కొలిచివేస్తాడు. రెండవ దానితో స్వర్గమును కొలచి వేస్తాడు. ఇతని శరీరముతో ఆకాశము నిండి పోతుంది. మరి మూడవ అడుగుకు చోటు వుండదు. తర్వాత నీ ప్రతిజ్ఞ పూర్తి చెయ్యని కారణముగా నీవు నరకమునకు వెళ్ళవలసి వస్తుంది. దేని వలన జీవిక చెడిపోతుందో అటువంటిదానము మంచిది కాదు. జీవిక వుంటే యజ్ఞము చేయగలవు. తపస్సు జరుగుతుంది. కర్మ జరుగుతుంది. అందువలన

తమ సంపదను ఐదు భాగములగా విభాగించాలి. ధర్మాయ యశసేర్థాయ కామాయ స్వజనాయచ (37) ఒక భాగము ధర్మము కొరకు రెండవ భాగము యజ్ఞము కొరకు, మూడవ భాగము ఇంకా ధనము సంపాదించటానికి, నాలుగవ భాగము సుఖభోగములకు, ఐదవ భాగము స్వజనులకు ఇవ్వడానికి వుండాలి. ఈ విధముగా తన ఆదాయమును ఐదు భాగములుగా చేసిన వారికి లోకపరలోకములు కళ్యాణ ప్రదములవుతాయి. 'సత్యమోమితి యత్ ప్రోక్తం యన్నేత్యాహా నృతమ్ హి తత్' (38) ఏదైన ఒక మాటను 'ఓం' అని అంగీకరించడము సత్యము అని అంటారు. శరీరము ఒక వృక్షము. సత్యము దాని ఫలము. ఒకవేళ వృక్షమే లేకపోతే ఫలపుష్పాదులు ఎక్కడి నుండి వస్తాయి? అనృత సంగ్రహమైన ఈ శరీరము వృక్షమునకు మూలము, మరి సత్యము ఈ వృక్షమునకు ఫలపుష్పములు. జీవనం నిలచివుంటే, దాని ద్వారా సత్యరూపమైన ఫలపుష్పాదులు వచ్చినాయంటే అది మనుష్యునికి మంచిదే కద. ఎవరైనా యాచించుటకు వస్తే ఓం అని చెబితే దాని అర్ధం అంగీకారమే. ఇది సన్యాసుల యొక్క మంత్రము. ప్రళయం జరిగింది అంటే 'ఓం', తృప్తి కలిగినది అంటే 'ఓం', మరణించారు అంటే ఓం.

'ఓం' అని అంటారు. అంటే ఏమి జరిగినా అది అంగీకారమే. శ్రీ ఆనంద మయిమా అంటారు. 'తండ్రీ! ఏమి జరుగుతుందో అదంత సరియైనదే ఇది ఒక మంత్రమే. ఋగ్వేదములో సత్యా సత్యమును నిలబెట్టుకుంటూనే అన్ని పనులు చేసుకోవాలి, అంతే కానీ తమ జీవితము శుష్కింప జేసుకోరాదు. అందువలన శుక్రాచార్యుడంటారు ఎవరైనా యాచించుటకువస్తే 'ఓం' అని అన్నారంటే వారికి ఇవ్వవలసి వస్తుంది. తర్వాత ఇక ఆ వస్తువు వారి దగ్గర వుండదు వెళ్ళిపోతుంది. అందువలన మనుష్యునికి అప్పుడప్పుడు లేదు నేను ఇవ్వను. ఈ వస్తువు నాకు జీవనాధారము అని చెప్పగలగాలి. కానీ అన్నిటికీ ఇవ్వనని చెప్పరాదు. ఇస్తానని చెప్పరాదు. శుక్రాచార్యుడు ఇంకా ఇలా చెప్పాడు. సత్యము పలుకుట వలన ఆవు చనిపోతుంటే, బ్రాహ్మణుడు మరణిస్తుంటే, ప్రాణసంకట సమయములలో, జీవితము నష్టము అవుతుంటే, కన్యల వివాహము జరుగకుండా వుంటే అటువంటి ప్రసంగము లలో అసత్యము పలకడము జుగుప్సితము కాదు– 'నానృతంస్యాద్జు గుప్సితం' (43) ఇది మొండి పట్టుదలగల వారి మాట కాదు, బుద్ధిమంతుల మాట! బుద్ధి మంతులు సమాజములో మౌనంగా వుండటము కూడ ఒక ధర్మమే. మాట్లాడుతూ పోవడమే ధర్మము కాదు. సత్యము చెబుతున్నామని ఒకరి మాటలు ఒకిరికి, భార్యవి, తల్లితో, తల్లివి భార్యతో, లేదా తన సంగతులు తన శత్రువులతో చెప్పడమన్నది ధర్మము కాదు. మౌనంగా వుండటమే ఎన్నో సందర్భములలో ధర్మమవుతుంది. అసలు ఉద్దేశ్యము జీవన రక్ష. దాని కొరకు యధాయోగ్యము, యధా స్థానము సత్యానృతములను పలుకవలెను అని శుక్రాచార్యుల వారు తెలియజేశాడు. మహాత్ములు దీనిని శుక్రనీతి అంటారు.

# గురు శిష్య సంబంధము

**శ్రీమతి సరస్వతీ దేవిగారు.**

## సూర్యుడు సూర్య కిరణముల వలె గురువు శిష్యులు

పవిత్ర భారతదేశమునందు అనేకమంది అవతారపురుషులు, మహాత్ములు జన్మించియున్నారు. జన్మించగలరు కూడా. ఈదేశములో అనేక ఆశ్రమములు, మహాత్ముల ఆధ్వర్యంలో జరుపబడుచూ, పీడిత మానవాళికి ఆత్మశాంతి ననుగ్రహిస్తూ ఆదర్శపురుషులై మానవులకు మార్గదర్శకులై అలరారుచున్నారు.

మానవుడు తన ఆనందముకొరకు ప్రయత్నిస్తూనే వుంటాడు. ఆ ఆనందము అభించుటకు ముఖ్యమార్గము సద్గురువును ఆశ్రయించుట. గురువులో దైవమును చూడటం చాల సులభమైన మార్గము. దేవుడున్నాడను నమ్మకము గల ఆస్తికుడుగూడా సర్వాంతర్యామి, సర్వవ్యాపకుడు. సర్వజ్ఞుడు అని కేవలం మాటలతోనే అనగలడుగాని. అనుభవముద్వారా తెలుసుకోవలయునన్న ప్రయత్నం చాల కొద్దిమందే చేయగలుగుచున్నారు. ఈ నమ్మకము అనుభవములోనికి తెచ్చుకోదలచినవారికి అతిసులభమైన మార్గము అనుభవముగల మహాత్ములను విశ్వసించుటయే.

వారిని ఆశ్రయించి. త్రికరణశుద్ధిగా వారిని అనుసరించటం, మనకన్న గురువు అధికుడన్నభావముతో మనము ఆతనిని ఆశ్రయించడం జరుగుచున్నదేకాని, కేవలం ఇది మాటలతోనే జరుపుతారు. తీరా, గురువు ఆజ్ఞమ పాలించవలసి వచ్చినప్పుడు. ఆ కార్యము ఎంత చిన్నదైనా, పెద్దదైనా, విమర్శన మొదలు పెడతారు. ఇంత స్వల్ప పని నాకు చెప్పారేమిటి? ఇంకొక శిష్యుడు ఆ పనికి తగినవాడుగదా. నా తెలివితేటలు విజ్ఞానము ఈ పనిలో నేనేవిథముగా చూపగలను. అని అనేక రీతులుగా తనలో తను విమర్శించుకోవటమే గాక, ఇతరులతో గూడ విమర్శించటం ప్రారంభిస్తారు. ఆశ్రమాలలో అనేక తరగతులవారు. అనగా ఆధ్యాత్మిక సాధనలో తరతమ భేదములు గలవారుండుట సహజము, సాధనలో తరతమ భేదములుండరాదు. స్థితితో వారివారి పూర్వజన్మ సంస్కారముల వలన వుండవచ్చును. అనగా, సాధన రెండుగంటలు చేయమని గుర్వాజ్ఞ అయితే ప్రథమ తరగతివారు. ఉత్తమ తరగతివారు చేసితీరవలసినదే. గురువు యందు విశ్వాసముగూడ యిట్లే యుండవలెను. మేము కొంత కాలము క్రితమే వచ్చితిమి. పాతవాళ్లంత విశ్వాసము మాకెట్లు వస్తుందని అనుకోరాదు.

గురువుయొక్క చర్యలు, వారియొక్క నిగూఢమైన భావములు. మనము అర్థం చేసుకొనలేక వారిని విమర్శించటంద్వారా మనము పతన మగుటయేగాక, అమాయకులైన యితరులను గూడా పాడుచేయుచున్నాము. ఓక ఆశ్రమంలో

అనేకమంది శిష్యులున్నపుడు వారిలో వారికి అభిప్రాయ భేదములుండవచ్చును. ఈ అభిప్రాయభేదములను ఒకరినొకరు ద్వేషించుకొనే పరిస్థితికి మాత్రము రానీయగూడదు. కనీసం గురువును, సుఖపెట్టే ప్రయత్నమైనా శిష్యులకుంటే, ఒకరినొకరు ద్వేషించుకొనుటవలన గురువు హృదయము నెంత నొప్పిస్తారో ఆలోచించినచో, ఇక జన్మలో మన సోదరశిష్యునేగాదు. ప్రపంచములో ఎవ్వరినీ ద్వేషించలేము. భగవంతుని చేరు అతి సులభమైన మార్గము గురువును సంతోషపర్చటము. గురునాజ్ఞ పాలించటము, సోదర శిష్యునిగూడ గురువుని ప్రేమించినంతగా ప్రేమించటము. ఇవి ముఖ్యముగా అమలుపరచుకొన్నచో, భగవంతుని వేరుగా వెతుక్కోనవసరంలేదు. అందరినుండి భగవంతుని కృపను పొందగలము. అన్నింటిద్వారా భగవంతుడు ఆశీర్వదించగలడు.

పరమపవిత్రమైన గురుశిష్యసంబంధము సూర్యునికి, సూర్యకిరిణమునకు వున్నంత సన్నిహితత్వ మున్నది. అనేక జన్మల కర్మను గురువు తనయొక్క దైవభక్తితో క్షయము గావించి శుద్ధులను చేయుటకు. అనేక కష్టనిష్టురములను పొందుచున్నారు. మన కుటుంబములోనివారు ఒకరితో నొకరు పోట్లాడి చీలికలైనచో ఆ గృహస్థున కెంత బాధకలుగునొ అంత కంటే అనేక రెట్లుబాధ తమ శిష్యులలో ఐకమత్యములేనిచో గురువునకు కలుగును. గురుసంతోష మాత్రంచేతనే సర్వలోకములూ శాంతి సంతోషయుతములగును. గురువుయొక్క హృదయం కష్టపడినచో భగవంతుని హృదయమే కంపించును. భగవంతుడు సర్వదా, గురువు యొక్క హృదయములోనే నివసించును. అగోచరముగానున్న దేవుని, ఏవిధముగా ధ్యానించాలన్న విచారము శిష్యులకు, భక్తులకూ అనవసరము, ఒక పెద్దభవంతికి గురువు పునాదివంటివాడైతే, ఆ భవనభాగములే శిష్యులు. ఆ భవనము శిథిల మవకుండా వుండటానికి, శిష్యులలో ఐకమత్యత, గురువిశ్వాసము అవసరము, అవిశ్వాసమనెడు పగుళ్ళు భవనమునకు రాకుండా చూచుకుంటూ ఒకవేళ వచ్చిననూ, గురుభక్తి అనెడు సిమ్మెంటుతో ఆ పగుళ్లను కప్పివేసి, పశ్చాత్తాపమనెడు సున్నముర్వారా శుభ్రపరచి, ఆ భవనమును మరింత విస్తరింపజేసిననాడే ఫలాని గురువు యొక్క శిష్యులమని చెప్పుకోగలుగుతాము. గురువుద్వారా మనము పొందేప్రేమ. వాత్సల్యము, రక్షణ, సహాయత, కృప, కరుణ, దయ, యిన్నింటితో మనము చేసేదెంతయో జాగ్రత్తగా ఆలోచించుకొన్నచో గురుఋణము ఏ విధముగా తీర్చగలమో కొంత యోచించినచో మనము చేసినది. చేయుచున్నది. చాల అల్పమే అనిపించక తప్పదు, గురువు తమ శిష్యులకోసం సర్వస్వం త్యాగం చేయుచున్నారు. శిష్యులు కనీసం వాళ్ల అహంకారము నైనా, త్యాగం చేయగల్గితే ధన్యులు కాగలరు. ఆ యాశ్రమములు స్వర్గతుల్యములు కాగలవు.

**లోకాసమస్తాఃసుఖినోభవంతు.**

# దాతలకు విజ్ఞప్తి

దివ్యాత్మ స్వరూపులకు సూచన. శ్రీ శాంతి ఆశ్రమమునకు విరాళము ధన రూపంలో / చెక్కు / ఎస్.బి.ఐ, కత్తిపూడి, అకౌంట్ నెం. 11003309435కు ఆన్‌లైన్ ద్వారా పంపగలరు. మీ విరాళములకు ఇన్‌కమ్‌ట్యాక్స్ 80జి రాయితీ కలదు. మీరు ఏ విధంగా విరాళము పంపినను వ్రాత పూర్వకంగా లేదా ఇమైయిల్ ద్వారా లేదా మొబైల్ నంబరు 7382009962కు మీ పేరు, చిరునామా మీ మొబైల్ నంబరు తెలుపగలరు.

# శాంతి పత్రిక చందాదారులకు విజ్ఞప్తి

శాంతి పత్రిక ప్రతినెలా 1,2 & 3 తేదీలలో పోస్టు చేయబడును.

సం॥ర చందా రూ. 100/–, జీవిత చందా రూ. 1000/– (12 సంవత్సరముల వరకు మాత్రమే), ఎమ్.ఓ/స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కత్తిపూడి అకౌంట్ నెం. 11003309435, ఆన్‌లైన్ ద్వారా ఈ క్రింది చిరునామాకు పంపగలరు.

ఎమ్.ఓ.ఫారమ్‌లో దిగువ ఫర్ కమ్యూనికేషన్ భాగములో మీ పూర్తి చిరునామా వ్రాయాలి. తదుపరి క్రొత్త చందా లేక పాత చందా అనునది క్లుప్తముగా వ్రాయాలి. పాత చందా అయితే చందాదారు సంఖ్య వ్రాయాలి.

చందాకాలం ముగింపుకు నెలముందే రెన్యువల్ చేసుకొనవలెను. మీ అడ్రస్ మార్పు జరిగితే, ఉత్తరము ద్వారా తెలుపుతూ చందా నెంబరు వ్రాయాలి. చందా వివరములు తెలుపని యెడల సొమ్ము విరాళముగా జమచేయబడును.

కార్యదర్శి, శ్రీ శాంతి ఆశ్రమం (పోస్ట్)

వయా శంఖవరం – 533 446, తూ.గో.జిల్లా

# విన్నపము

విదేశములలో వుండు ఆశ్రమ భక్తులు విరాళములు ఈ క్రింది ఎఫ్.సి.ఆర్.ఎ (Foreign Contributions Regulation Act) బ్యాంక్ అకౌంట్‌కు తమ యొక్క నివసించే ప్రాంతములోని తమ బ్యాంక్ అకౌంట్ నుండి ఆదేశ కరెన్సీలో పంపగలరు. పంపిన పిదప వివరములు srisanthiashram@gmail.com అనే మెయిల్ ఐడికి మరియు mattavvs07@gmail.com కి తప్పకుండా పంపవలెను.

బ్యాంకు పేరు :State Bank of India, 11 Sansad Marg, New Delhi-110001

A/c Name : THE MISSION OF PEACE - FCRA A/c No : 40127798428

Swift Code : SBININBB104

**1. మాతృ ఆశ్రమం**
శ్రీ శాంతి ఆశ్రమము
తోటపల్లి కొండలు, పిన్ : 533 446.
వయా శంఖవరం, తూ.గో.జిల్లా.
సెల్ : 7382009962
రిసెప్షెన్ : 6305349677
e-mail:srisanthiashram@gmail.com

**2. విశాఖ : శాంతి ఆశ్రమము**
లాసన్స్‌బే, పెదవాల్తేరు - 530 017
విశాఖపట్నం.
ఫోన్ : 0891 - 2538689
e-mail : srisanthiashramvsp@gmail.com

**3. విశ్వశాంతి క్షేత్రం**
కైలాసగిరి, విశాఖపట్నం

**4. కోటగిరి శాఖ**
పీస్ సెంటర్, డార్‌మోనా రోడ్,
కోటగిరి - 643217, నిలగిరి జిల్లా.
తమిళనాడు.
ఫోన్ : 04266-271945
e-mail : vsvmsktg@yahoo.com
vsvmsktg@gmail.com

**5. కాకినాడ శాఖ**
శాంతి ఆశ్రమము, అశోక్ నగర్
కాకినాడ - 533 004.
తూ.గో.జిల్లా

**6. పిఠాపురం శాఖ**
స్టువర్టు పేట,
పిఠాపురం-533 450. తూ.గో.జిల్లా.

**Website : www.srisantiashram.org**

## కార్యక్రమములు - మాతృ ఆశ్రమం

**తేది 1-1-2022 (శనివారం)** ఆంగ్ల నూతన సంవత్సరం

**తేది 5-1-2022 (బుధవారం)** శ్రీశ్రీ పరమహంస యోగానంద జయంతి

**తేది 12-1-2022 (బుధవారం)** స్వామి వివేకానంద జయంతి

**తేది 13-1-2022 (గురువారం)** వైకుంఠ ఏకాదశి సందర్భంగా శ్రీకృష్ణ అష్టోత్తర శతనామార్చన

**తేది 14-1-2022 (శుక్రవారం)** "భోగి" సందర్భంగా శ్రీకృష్ణ అష్టోత్తర శతనామార్చన

**తేది 15-1-2022 (శనివారం)** "మకర సంక్రాంతి" సందర్భంగా శ్రీ లక్ష్మీ అష్టోత్తర శతనామార్చన

**తేది 16-1-2022 (ఆదివారం)** "కనుమ" సందర్భంగా గోమాత అష్టోత్తర శతనామార్చన

**తేది 26-1-2022 (బుధవారం)** గణతంత్రదినోత్సవము

**తేది 30-1-2022 (ఆదివారం)** మహాత్మాగాంధీజీ వర్ధంతి

ఈ కార్యక్రమములు శ్రీ గణేష్ ఆచార్య, శ్రీ గంగరాజు మాష్టారు గారిచే నిర్వహించబడును.

# శాశ్వత అన్నదానం

1. శ్రీమతి కొల్లేపర సత్యవతి గారు (శ్రీశాంతి ఆశ్రమం) 10,000/-
వీరి అత్తయ్యగారు కీ॥శే॥ కె. వెంకటరత్నం గారి జ్ఞాపకార్థం
వీరి మావయ్య గారు కీ॥శే॥ కె. లక్ష్మయ్యగారి జ్ఞాపకార్థం
2. శ్రీ భీమిరెడ్డి శ్రీనివాసరావు గారు శ్రీమతి బి. రేణుక (ఏలేశ్వరం) 20,000/-
వీరి తల్లిదండ్రులు కీ॥శే॥ శ్రీమతి రామలక్ష్మి గారు కీ॥శే॥ శ్రీ బి. వెంకట నరసింహరావు గార్ల జ్ఞాపకార్థం
3. శ్రీమతి యక్కల నిర్మలజ్యోతి గారు (విజయవాడ) 40,000/-
వీరి భర్తగారు మరియు అమ్మమ్మ గార్లు శ్రీ వై. హనుమంతరావుగారు,
శ్రీమతి ఉప్పుటూరి మహాలక్ష్మమ్మ గార్ల జ్ఞాపకార్థం
4. శ్రీమతి సుంకర మహాలక్ష్మి గారు (కాకినాడ) 5,000/-
వీరి భర్త శ్రీ ఆదిరెడ్డి అప్పారావుగారి జ్ఞాపకార్థం
5. శ్రీ ప్రతాప్ కృష్ణ గారు (ముంబయి) 10,000/-
వీరి మనుమడు హర్షివ్ వాసంశెట్టి గారి పుట్టినరోజు సందర్భంగా
6. శ్రీఎస్. సోమలింగేశ్వర రావు గారు,శ్రీమతి సత్యవతిగారు తాడేపల్లి గూడెం వీరి ఆరోగ్యం కోరుతూ 5,000/-
7. శ్రీమతి గుండు సుబ్బలక్ష్మి గారు (హైదరాబాద్) 5,000/-
వీరి భర్తగారు శ్రీ జి. వెంకటరమణారావు గారి జ్ఞాపకార్థం
8. శ్రీ వి. రాధాకృష్ణ (కాకినాడ) శ్రీ బి.వి.ఎస్.ఆర్. శర్మ (రిటైర్డ్ పోస్ట్‌మాస్టర్) గారి జ్ఞాపకార్థం 5,000/-
9. శ్రీ శాంతి స్వరూప్ శర్మ గారు (హైదరాబాద్) 11,116/-
10. శ్రీ కర్రి శ్రీనివాస్ గారు శ్రీమతి లక్ష్మి ప్రియాంక గారు(కాకినాడ) వీరి పెండ్లిరోజు సందర్భముగా 5,000/-

## విరాళములు

1. శ్రీ కొలగట్ల మూర్తి గారు (విశాఖపట్నం) 10,000/-
వీరితండ్రిగారు శ్రీ బ్రహ్మాజీ రావు గారి జ్ఞాపకార్థం మరియు గోగ్రాసం నిమిత్తం
2. శ్రీమతి కామేశ్వరమ్మ గారు (హైదరాబాద్) వీరి ఆరోగ్యం కోరుతూ అన్నదానం 5000/-
3. శ్రీమతి యక్కల నిర్మలజ్యోతి గారు (విజయవాడ) 35,000/-
వీరి భర్త శ్రీ వై. హనుమంతరావు గారి జ్ఞాపకార్థం
గిత్తల షెడ్ నిర్మాణమునకు మరియు పిల్లల సంక్షేమం నిమిత్తం
4. శ్రీ ఎస్. గణపతి రావు గారు (రాజమండ్రి) 6000/-
5. శ్రీ గోలి రామారావు గారు సన్ఆఫ్ నాయుడు గారు (వేట్లపాలెం) ఎండు గడ్డి నిమిత్తం 13,000/-
6. శ్రీ కంటిపూడి బలరాం గారు, శ్రీమతి భవాని గారు (వేట్లపాలెం) 13,000/-
ఎండుగడ్డి నిమిత్తం
7. శ్రీ సానిపిని వీర్రాజు గారు శ్రీమతి వీరాయమ్మ గారు (వేట్లపాలెం) 13,000/-
ఎండుగడ్డి నిమిత్తం
8. శ్రీ గుణ్ణం రామకృష్ణ గారు, శ్రీమతి బేబి గారు (వేట్లపాలెం) 7000/-
ఎండుగడ్డి నిమిత్తం
9. శ్రీ ఎ.వి.ఎల్. నారాయణ గారు గోదానం నిమిత్తం 35000/-
10. శ్రీ ఇళ్ళ కేశవరావు గారు (హైదరాబాదు) 22,000/-
విద్యాఖర్చుల నిమ్తిం
11. శ్రీ గరిగిపాటి హేమగారు (విశాఖపట్నం) 10,000/-
గోశాల నిర్వాహణ నిమిత్తం
12. శ్రీమతి జి.బి.ఎస్. లక్ష్మిగారు (విశాఖపట్నం) 8000/-
డా॥ హేమగారు శ్రీ వై. హరికృష్ణ గార్ల పెండ్లిరోజు సందర్భంగా
13. శ్రీమతి రావిపాటి రమాదేవి గారు (వేళంగి) 5000/-
వీరి మనుమడు పెండ్లి సందర్భముగా అన్నదానం
14. శ్రీ దివ్య బాబాజీ సుషుమ్న క్రియాయోగా ఫౌండేషన్ 10,000/-
(విశాఖపట్నం) అన్నదానం నిమిత్తం

This Periodical is Registered with Registrar of Newspapers, New Delhi Vide R.No. 3447/57, Dt. 18-12-20 Permitted to Post Under Concessional Postage Vide AP/KD-24/2021-2023

# SRI SANTI ASHRAM ENGLISH PUBLICATIONS

1. Auto Biography of Swami Omkar (2 Volumes) .......... Rs. 150/-
2. Life and Teachings of Swami Omkar .......................... Rs. 10/-
3. Soham .......................................................................... Rs. 10/-
4. Cosmic Fast .................................................................Rs. 20/-
5. Meditation.....................................................................Rs.10/-
6. Om Japa .......................................................................Rs.10/-
7. Control of Mind ............................................................Rs.30/-
8. Cosmic Flashes ............................................................Rs.10/-
9. In the Hours of Silence ............................................. Rs.10/-
10. The Soul of Omkar .....................................................Rs.10/-
11. How I learned English ...............................................Rs.10/-
12. Reincarnation of my Little Sister ...............................Rs.10/-
13. God Realization Now and Here .................................Rs.10/-
14. Mystic Prayers and Poems .........................................Rs.20/-
15. The Divine Voice of Omkar .........................................Rs.40/-
16. Auto Biography of Omkar (Revised Edition) ..............Rs.100/-
17. Petals of Peace ..........................................................Rs.20/-
18. The Story of my life and Work ...................................Rs.10/-
19. Priceless legacy of Swami Omkar ...........................Rs.10/-
20. The Four Initiations ...................................................Rs.10/-
21. Musings .....................................................................Rs.20/-
22. Peace Prayer .............................................................Rs.20/-

THE MISSION OF PEACE
శ్రీ శాంతి ఆశ్రమము
పోస్టు : శాంతి ఆశ్రమము
(వయా) శంఖవరం - 533 446.
తూ॥గో॥జిల్లా., (ఆ.ప్ర.)
ఫోన్ : 7382009962
email:srisanthiashram@gmail.com
www :www.srisantiashram.org

Printed Book

To

Printed by Padmanabha Offset Printers and Published by Swamini Vinamrananda on behalf of The Mission of Peace Sri Santi Ashram and Printed at Padmanabha Off-set Printers, Kakinada - 533 004 Cell : 93979 50719 and Published at Thotapalli Hills 533 446 Ph : 7382009962 Editor : Swamini Vinamrananda.